క్లుప్తంగా

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజం



ఏఎస్సైని సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ

జగిత్యాల క్రైం: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఇంటలిజెన్స్ అడిషనల్ ఎస్పీ ఎండీ. గౌస్‌బాబా అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని జోనల్ ఇంటలిజెన్స్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఎస్సై సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోలీస్ నిఘా విభాగంలో పనిచేస్తూ ఒత్తిడి తట్టుకుని విధి నిర్వహణలో తనదైన పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన హోంగార్డు శ్రీనివాస్‌ను కూడ సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు రాజేందర్, వెంకటయ్య, గంగాధర్, వెంకటేశ్వర్లు, మహ్మద్ రియాజ్ పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు వ్యతిరేక ప్రచారం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ

జగిత్యాల క్రైం: యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. ఆదివారం స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐవో) జగిత్యాల యూనిట్ భవిష్యత్తు రక్షణ, డ్రగ్స్ మద్యం వ్యసనాలపై అవగాహన కార్యక్రమ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో మత్తు పదార్థాల వినియోగం అనేది అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్ఐవో అసిస్టెంటు సెక్రటరీ అఫ్రోజ్, యూనిట్ సెక్రటరీ కతీఫ్ ఉల్‌హక్ పాల్గొన్నారు.

తూము షట్టర్‌కు మరమ్మతు చేయించాలి



మాటు కాలువను పరిశీలిస్తున్న కృష్ణారావు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గంగనాల ప్రాజెక్టు కాలువ తూము షెట్టర్‌ను మరమ్మతులు చేయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అధికారులను కోరారు. ఆదివారం మండలంలోని వేములకుర్తిలోని గంగనాల ప్రాజెక్టు మాటు కాలువ తూమును పరిశీలించారు. షెట్లర్లు శిథిలావస్థలో ఉండటంతో నీళ్లు వృథాగా పోతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పెంట లింబాద్రి, ఏఎంసీ డైరెక్టర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న బీఎస్ లత

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ అందరి వాడని, ఆ మహనీయుడి స్ఫూర్తితో యువత మంచి పౌరులుగా ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి అర్పించే కార్యక్రమానికి బీఎస్ లత ముఖ్య అతిథిగా హాజరై జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, చిత్తారి ప్రభాకర్, నకుమల్ల లక్ష్మీనారాయణ, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎంఆర్పీ ధరలకే ఎరువుల విక్రయాలు

పెగడపల్లి: పెగడపల్లి, నంచర్ల సహకార సంఘాల నుంచి రైతులకు నాణ్యమైన ఎరువులను ఎంఆర్పీ ధరలకే విక్రయిస్తున్నట్లు ఆయా సంఘాల సీఈవోలు తడుకమడ్ల గోపాల్‌రెడ్డి, రౌతు మధుకర్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని రైతులను కోరారు.



అసంపూర్తిగా వదిలేసిన సీసీరోడ్డు,మురికి కాల్వ నిర్మాణ పనులు

సీసీరోడ్డు నిర్మించేదెప్పుడో..?

రాయికల్: బల్దియాలోని 1వ వార్డులోని సాయినాథ్ ఇడ్లీ సెంటర్ పక్కనే ఉన్న కాలనీలో సీసీరోడ్డుకు నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువల నిర్మాణ పనులు సైతం అసంపూర్తిగా చేయడంతో నీరు నిలువ ఉండటంతో దోమలు స్వైర విహారంతో జ్వరాల బారిన పడుతున్నామని వర్షం పడటంతో నడవలేక పోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ స్పందించి కాలనీలో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బొమ్మెన- తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య ధ్వంసమైన తారు రోడ్డు

నెల రోజులకే ధ్వంసమైన తారు రోడ్డు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి– బొమ్మెన గ్రామాల మధ్య తారు రోడ్డు పనులు నెలరోజుల క్రితం పూర్తి చేశారు. నెల రోజులకే తారు రోడ్డు ధ్వంసం కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓవర్‌లోడ్ వాహనాలు వెళ్లడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతాయని, మరోవైపు కేజీవీల్స్ ట్రాక్టర్లు తారు రోడ్డుపై వెళ్లితే రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆర్ అండ్ బీ ఏఈ లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. తారు రోడ్డుపై కేజీవీల్స్‌తో ఉన్న ట్రాక్టర్లు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ధ్వంసమైన తారు రోడ్డును మరమ్మతులు చేయిస్తామని ఏఈ లక్ష్మీకాంత్ తెలిపారు.



రాజనగర్‌లో మరమ్మతుకు తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్

మరమ్మతుకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్

రాయికల్: మండలంలోని రాజనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై 20 రోజుల క్రితం పిడుగుపడి కాలిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం 15 రోజుల క్రితం ట్రాన్స్‌కో అధికారులు జగిత్యాల కార్యాలయానికి తరలించారు. అప్పటి నుంచి నేటి వరకు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వరినాట్లు వేసే సమయంలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పందించి మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ బడుల్లో జోరుగా దందా..

- యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగుల అమ్మకాలు
- నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల ఫీజుల వసూలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు(ఫైల్)

గొల్లపల్లి: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూఫాంలు, టై,బెల్టులు, బ్యాగులను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ఓ ప్రైవేట్ పాఠశాలలో పట్టుకుని ఆందోళన చేపట్టినా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం యూనిఫాంలు, టై,బెల్టులు, అమ్మకాల విషయంలో ఓ వస్త్ర దుకాణంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ దుకాణంలో మాత్రమే యూనిఫాంలు, టై బెల్టులు లభిస్తాయి. ఒక్కో యూనిఫాంకు రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నా.. పట్టించుకునే వారే లేరు. జిల్లాలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ఇలా వస్త్ర దుకాణాలతో కమీషన్లు మాట్లాడుకుని ఆ షాపులో మాత్రమే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.అంతే కాకుండా చాలా స్కూళ్ల నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో విద్యార్థి నుంచి అడ్మిషన్ ఫీజు కింద రూ.5వేల చొప్పున వసూలు చేస్తున్నాయి. దీనికి వివిధ రాకల ఫీజులు అధనం..

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదు. ఏటా స్కూల్ ఫీజులను పెంచేస్తున్నాయి. వివిధ రకాల ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయి.పలు పాఠశాలలు ప్రాథమిక విద్యకే రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొన్ని ప్రీ ప్రైమరీ విద్యకు సైతం రూ.30 వేలకు పైగా వసూలు చేస్తుండడం గమనార్హం.

జిల్లాలోని 215కు పైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. విద్యా సంస్థలు చదువు, జ్ఞానం అందించే క్షేత్రాలుగా ఉండాలని, ఎలాంటి వ్యాపారం చేయవద్దని ప్రభుత్వ నిబంధనలున్నా అవేవి అమలు కావడం లేదు. యజమాన్యాలు యథేచ్ఛగ వ్యాపారం చేస్తున్నాయి. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ ఫీజు వసూలు చేయరాదు. ప్రతీ ప్రైవేట్ స్కూల్‌లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించి ఉచితంగా విద్య అందించాలనే నిబంధన ఉన్న ఇవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ప్రైవేట్ స్కూల్స్‌లో నోటు బుక్స్,బ్యాగులు తదితర సామగ్రి విక్రయించరాదు.నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.స్కూల్ నోటీసు బోర్డులో ఫీజుల వివరాలను ఉంచాలి.అధిక ఫీజులు,అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. – రాము, డీఈవో,జగిత్యాల



కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయం సమీపంలో డ్రైనేజీలో చెత్త పేరుకుపోవడం, పక్కనే పిచ్చిమొక్కలు పెరగడంతో అధ్వాన్నంగా తయారైందని గ్రామస్తులు తెలిపారు. వర్షం కురిస్తే మురికినీరు రోడ్డుపై పారుతుందన్నారు. అధికారులు చొరవ చూపి డ్రైనేజీని శుభ్రం చేయించి పిచ్చిమొక్కలను తొలగింపజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్,ఎంపీవో, కథలాపూర్ సెల్ నంబర్: 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మల్యాల, నూకపల్లి గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన గసిగంటి అజయ్ కుటుంబ సభ్యులకు, నూకపల్లిలో బీనవేని పెద్దన్న కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్ గౌడ్, ముత్యం శంకర్, తిరుపతి, ముదాం మల్లేశం, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూఏఈ జాగృతి కార్యదర్శిగా శేఖర్ గౌడ్



ఎమ్మెల్సీ కవితతో శేఖర్ గౌడ్

మల్యాల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన యువకుడు శేఖర్ గౌడ్ యూఏఈ జాగృతి కార్యదర్శిగా నియమిస్తూ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత నియామకపు ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన నవీనాచారి, గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు గుండల్లి నర్సింహా,కిరణ్‌కుమార్, వేంకటేశ్వర్‌రావు, శ్రీధర్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వగ్రామానికి చేరనున్న మృతదేహం

మల్యాల: జగిత్యాల పట్టణానికి చెందిన రెవెల్ల రవీందర్(57) ఈ నెల 16న ఇజ్రాయిల్‌లో గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందగా, ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడంతో జాప్యం నెలకొంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇజ్రాయిల్‌లోని ఇండియన్ ఎంబసీ ద్వారా సంప్రదింపులు జరపడంతో మరో రెండు రోజుల్లో మృతదేహం స్వగ్రామానికి చేరనుంది.

ఘనంగా జాతీయ ఫొటో కెమెరా దినోత్సవం

ధర్మపురి: జాతీయ ఫొటో కెమెరా దినోత్సవ వేడుకలను ధర్మపురి మండల ఫొటో, వీడియో కెమెరా సంఘం వారి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్మపురికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ వడ్లూరి రవీందర్ మట్టితో తయారు చేసిన చాయా చిత్ర యంత్ర దేవతను అమ్మవారి చిత్రపటం ముందుంచి అలంకరించి పంచమృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంజారా సేవా సంఘ్ మండల అధ్యక్షుడిగా చిరంజీవి

రాయికల్: మండల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మండల అధ్యక్షుడిగా గుగ్లావత్ చిరంజీవి నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య శంకర్‌ను ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ ఆదివారం తెలిపారు. సంఘం పటిష్టత కోసం కృషి చేస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలో 2003– 04 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం వీకేబీ ఫంక్షన్‌హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రావు, జగన్‌రావు, శ్రీధర్‌రావు, సతీష్, అశోక్, గంగాధర్‌తో పాటు విద్యార్థులు వంశీ,అరుణ్,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఐఎం బలోపేతానికి కృషి చేయాలి

కోరుట్ల: కోరుట్లలో ఎంఐఎం పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ సాహిద్ అన్నారు. పట్టణంలో పలువురు ఆదివారం ఎంఐఎం పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కండువాలు కప్పి మాట్లాడారు. ఎంఐఎం కార్యకర్తలు సొంత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ ప్రయోజనాల కోసం , పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రఫియొద్దీన్,నాయకులు భూమయ్య, సురేష్, వాజిద్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులి వేషధారులు పేర్లు నమోదు చేసుకోవాలి

మల్యాల: మండలంలో మొహర్రంను పురస్కరించుకుని పెద్దపులి వేషం వేయాలనుకునేవారు తమ పేర్లను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై నరేశ్‌కుమార్ సూచించారు.

రాయికల్‌లో పులి వేషధారణ సందడి

రాయికల్: పట్టణంలో మొహరం వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. యువకులు పులి వేషధారణలతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొల్పారు.

బీజేపీ కార్యవర్గం ఏర్పాటు

కథలాపూర్: మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు మల్యాల మారుతి ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఆల్గోట్ ప్రమోద్, దండిక లింగం, దయ్య లక్ష్మి, జిల్లా సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శులుగా నరెడ్ల రవీందర్‌రెడ్డి, గడ్డం జీవన్‌రెడ్డి. కార్యదర్శులుగా కరిపె రమ, పల్లె గంగాధర్, యాటకర్ల అశోక్, దేశవేని సునిల్. కోశాధికారిగా వొడ్నాటి సునీల్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

మన్ కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీబాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కథలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి. నాయకులు వెంకటేశ్వర్‌రావు, ప్రతాప్, మహేశ్, జీవన్‌రెడ్డి, సత్యం, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు సందడి



రాయికల్‌లో గోరింటాకుతో మహిళలు

రాయికల్: పట్టణంలో ఆదివారం భవాని కిట్టి పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఆషాడమాసం సందర్భంగా గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. గోరింటాకు తయారుచేసుకుని గోరింటాకు పెట్టుకుని ఆటపాటలతో సందడిచేశారు.

విశ్వబ్రాహ్మణ సంఘం బోనాలు



బోనంతో ఎమ్మెల్యే సతీమణి రాధిక, మహిళలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణ వీరబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో ఎమ్మెల్యే సతీమణి రాధిక పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. ఆదివారం జగిత్యాల పట్టణంలో జరిగిన ఈ బోనాల పండుగలో పాల్గొన్న రాధిక విశ్వబ్రాహ్మణ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.



పోచమ్మ బోనాలతో గ్రామస్తుల ఊరేగింపు

పోచమ్మ బోనాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో 16 కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో వల పట్టుకుని బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దేవతకు నైవైద్యం సమర్పించారు. పంటలు బాగా పండాలని దేవతను గ్రామస్తులు పూజించారు.

ఘనంగా శ్రీజగన్నాథస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో భక్తులు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి నీలాచల కొండపై వెలసిన శ్రీ భూదేవి, నీలాదేవి సమేత శ్రీ జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అంతకు ముందు ప్రాతకాల ఆరాధన, బాలభోగ నివేదన, నిత్యహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.